అంబేద్కర్ విగ్రహాల వద్ద ప్రత్యేక బందోబస్తు

ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

ఏలూరు స్పోర్ట్స్ :134వ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా అంబేద్కర్ విగ్రహాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం అంబేద్కర్ 134వ జయంతిని పురస్కరించుకుని అంబేద్కర్ విగ్రహాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చేసుకోకుండా ఉండేందుకు ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, పోలవరం సబ్ డివిజన్ల పరిధిలో ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఆయా విగ్రహాల వద్ద సీసీ కెమెరాలను ఆగమేఘాల మీద ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా సిబ్బందిని ఆయా విగ్రహాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం ఏలూరు సబ్ డివిజన్ పరిధిలోని ఏలూరు రూరల్ ప్రాంతాల్లో అంబేద్కర్ విగ్రహాల వద్దకు చేరుకున్న పోలీసులు సంబంధిత పెద్దలకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు.

'ధాన్యం' టెన్షన్..!

- ముమ్మరంగా రబీ ధాన్యం మాసూళ్లు
- వాతావరణ మార్పులతో రైతుల్లో ఆందోళన
- సరిపడా గోనె సంచులు అందుబాటులో లేని పరిస్థితి
- ధాన్యం కొనుగోలు లక్ష్యంలో కోత.. కొనుగోలు చేయకపోతే ఎలా?
- ఏలూరు జిల్లాలో 23 వేలు, పశ్చిమలో 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- 48 గంటల్లోపే ధాన్యం సొమ్ము జమతో రైతుల్లో సంతృప్తి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వరి రైతులను ధాన్యం టెన్షన్ వెంటాడుతోంది. వాతావరణ మార్పులతో ఈదురుగాలులు, వర్షం కురుస్తుండటంతో అన్నదాత ఆందోళనకు గురవుతున్నాడు. మరోపక్క సరిపడా గోనె సంచులు రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో లేకపోవడం, ధాన్యం కొనుగోలు లక్ష్యాలు కుదించడం అన్నదాత గుండెల్లో గుబులు రేపుతున్నాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో రబీ మాసూళ్లు ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. రబీలో పశ్చిమలో 2.21 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేయగా దాదాపు 40 వేల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. ఇప్పటి వరకూ 30 వేల మెట్రిక్ టన్నుల వరకూ ధాన్యం కొనుగోళ్లు సాగాయి. ఏలూరు జిల్లాలో 80 వేల ఎకరాల్లో వరి సాగు సాగగా ఇప్పటి వరకూ 15 వేల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. 23 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగింది. కొనుగోలు చేసిన ధాన్యం సొమ్ము 48 గంటల్లోపే జమ కావడంతో రైతుల్లో సంతృప్తి నెలకొంది. ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలు సాఫీగా సాగడంతో, రబీలోనూ ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ధాన్యం కొనుగోలు సాగుతుందని రైతులు ముందుకు సాగుతున్నారు. గత ప్రభుత్వంలో ధాన్యం సొమ్ము నెలల తరబడి జమయ్యేది కాదు. దీంతో రైతులు అయినకాడికి దళారులకు అమ్ముకునేవారు. ధాన్యం సొమ్ము ఒకటి, రెండు రోజుల్లోనే జమ కావడంతో రైతులు సైతం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం మాత్రం టార్గెట్లు నిర్ణయించి రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

ధాన్యం కొనుగోలు టార్గెట్లలో కోత

ప్రతి ధాన్యపు గింజ కొనుగోలు చేస్తామంటూ ప్రభుత్వం ఒకపక్క చెబుతూనే మరోపక్క జిల్లాల వారీగా ధాన్యం కొనుగోలుకు సంబంధించి టార్గెట్లు పెట్టింది. ఏలూరు జిల్లాలో రబీలో 3.97 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వం మాత్రం తొలుత లక్షా 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పింది. అయితే ఇప్పుడు రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యమే కొనుగోలు చేస్తామని చెబుతోంది. దిగుబడిలో సగం ధాన్యం మాత్రమే కొనుగోలు చేస్తామని చెబుతుండటంతో మిగిలిన లక్షా 97 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతులు ఎవరికి అమ్ముకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది. వ్యాపారులకు అమ్ముకుంటే ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర దక్కని పరిస్థితి. పశ్చిమగోదావరి జిల్లాలో తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. కొనుగోలు టార్గెట్ మాత్రం ఆరు లక్షల మెట్రిక్ టన్నులే ఇచ్చారు. మరి మిగిలిన ధాన్యాన్ని రైతులు ఏం చేయాలి. అయినకాడికి దళారులకు అమ్ముకోవాల్సిందేనా అనే ప్రశ్నకు ప్రభుత్వం నుంచి సరైన సమాధానం లేకుండాపోయింది. ధాన్యం సొమ్ము సకాలంలో ఇచ్చి, మద్దతు ధర వస్తుండటంతో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకునేందుకు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం రైతుల నుంచి పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేయకుండా పక్కకు తప్పుకోవాలని చూడటంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

ఉంగుటూరులో ధాన్యం ఆరబెడుతున్న రైతులు

గోనె సంచుల కొరత ఎదుర్కోవాల్సిందేనా..?

గత ప్రభుత్వ హయాంలో ధాన్యం కొనుగోలులో రైతులు ఎదుర్కొన్న ప్రధాన సమస్యల్లో గోనె సంచుల కొరత ఒకటి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఖరీఫ్‌లో గోనె సంచుల కొరత రాకుండా చూసుకున్నారు. రబీలో మాత్రం గోనె సంచులపై సరైన ప్రణాళిక లేకుండా ముందుకు సాగుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఏలూరు జిల్లాలో 55 లక్షల వరకూ గోనె సంచులు అవసరం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అందుకు తగిన విధంగా ఏర్పాట్లు మాత్రం జరగలేదని స్పష్టంగా కనిపిస్తోంది. ఒక మండలానికి అవసరమైన సంచుల్లో నాలుగొంతుల్లో ఒక వంతు సంచులు మాత్రమే రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. 16 లక్షల సంచులు అవసరం ఉంటే నాలుగు లక్షల సంచులు మాత్రమే ఇచ్చిన పరిస్థితి ఉంది. ఖరీఫ్‌లో మాత్రం ముందుగానే సరిపడా సంచులను అందుబాటులో ఉంచారు. ఖరీఫ్ కంటే రబీలో దిగుబడి ఎక్కువగా వస్తోంది. సంచుల అవసరం ఎక్కువగా ఉంటుంది. జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలిస్తున్నా సంచులు మాత్రం సరిపడా లేవని క్షేత్రస్థాయి పరిస్థితులను బట్టి తెలుస్తోంది. వాతావరణ మార్పులతో రైతులు మాసూళ్లు త్వరగా పూర్తి చేయాలని చూస్తున్నారు. దీంతో ఒక్కసారిగా ధాన్యం అందుబాటులోకి వచ్చే పరిస్థితి ఉంది. దీంతో సంచుల కొరత రైతులను వెంటాడే పరిస్థితి ఉందనే ఆందోళన సర్వత్రా నెలకొంది. అదే జరిగితే రైతులు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడనుంది. అధికారులు సంచుల ఏర్పాటులో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పశ్చిమలో కొంతమేర సంచులు అందుబాటులో ఉన్నప్పటికీ ధాన్యం ముమ్మరంగా వస్తే ఇబ్బంది వచ్చే పరిస్థితి ఉందనే ఆందోళన సైతం ఉంది. జిల్లా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే రైతులు ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని చెప్పొచ్చు.

అంబేద్కర్ విగ్రహానికి అవమానం..!

చెప్పల దండ వేసిన ఆగంతకులు

నిరసనగా దళితుల రాస్తారోకో

ఆందోళన చేస్తున్న దళితులు

ప్రజాశక్తి - భీమడోలు

రాజ్యాంగ నిర్మాత, భారతరత్న, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి భీమడోలు మండలంలో ఘోర అవమానం జరిగింది. భీమడోలు మండలం పొలసానిపల్లిలో ద్వారకాతిరుమల రహదారి పక్కన ఆవిష్కరణకు సిద్ధంగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి గుర్తుతెలియని దుండగులు శనివారం రాత్రి చెప్పల దండ వేశారు. ఆదివారం తెల్లవారుజామున ఈ దుర్ఘటన వెలుగు చూడటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. భీమడోలు సిఐ విల్సన్ నేతృత్వంలో క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ రంగంలోకి పలు ఆధారాలు సేకరించారు. వాటి ఆధారంగా పలువురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎవరూ, ఎటువంటి ఆగ్రహావేశాలకు లోను కావొద్దని, నిందితులను అధునాతన పరిజ్ఞానం ఉపయోగించి సీసీ కెమెరాలు, ఫోన్ ట్రాకింగ్ సహాయంతో పట్టుకుంటామని సిఐ తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు సంతోష్ కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి ఇలాంటి అవమానం బాధాకరమని, దుండగులను తక్షణం అరెస్టు చేసి కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. పోలీసులపై తమకు పూర్తి నమ్మకం ఉందని వెల్లడించారు.

విగ్రహం వద్ద పోలీసు జాగిలంతో పరిశీలన

గిట్టుబాటు ధర ఇవ్వకపోతే పోరాటం

వర్జీనియా పొగాకు కిలోకు

రూ.350 ఇవ్వాలి

ఎపి రైతుసంఘం

అభివాదం చేస్తున్న నేతలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

వర్జీనియా పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించకపోతే పోరాటం చేయక తప్పదని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలోని దర్భగూడెంలో ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో వర్జీనియా పొగాకు రైతుల గిట్టుబాటు ధర సమస్యపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ గత సంవత్సరం వర్జీనియా పొగాకు సరాసరి ధర కిలోకు రూ.330 వరకు వచ్చిందన్నారు. ఈ సంవత్సరం పెట్టుబడి ఖర్చులు, కౌలు రేట్లు పెరిగాయన్నారు. గత సంవత్సరం వలె మార్కెట్ ధరలు ఉండే పరిస్థితి కనిపించడం లేదన్నారు. ఇప్పటికే వైట్ బర్లీ పొగాకు కొనుగోలు చేయడం లేదని చెప్పారు. వర్జీనియా పొగాకుకు తగిన ధర వచ్చేలా పొగాకు బోర్డు అధికారులు, ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్రంలో వివిధ పంటల రైతులకు కనీస ఖర్చులు కూడా రావడం లేదని, రైతులు నష్టపోయి అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్జీనియా పొగాకు ఎకరా సాగుకు కౌలుతో కలిపి రూ.3 లక్షలకుపైగా పెట్టుబడి అవుతోందన్నారు. పెరిగిన ఖర్చులకు అనుగుణంగా వర్జీనియా పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిరిబత్తుల సీతారామయ్య, జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, బిక్కిన వీరసత్యం, సింహాద్రి శ్రీనివాసరావు, బోడిక రామచంద్రరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆక్వా రైతుల ఇబ్బందులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

సాగులో నిబంధనలు పాటించాలి

దాతల భాగస్వామ్యంతో ల్యాబ్ ఏర్పాటు

డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు, ఎంపీ బీదా మస్తాన్‌రావు



రైతుల సదస్సులో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - ఉండి

రైతు శ్రేయస్సే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన సాగిస్తుందని ఉండి, ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజు, రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్‌రావు అన్నారు. ఆదివారం స్థానిక కోట్ల ఫంక్షన్ హాలులో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆక్వా రైతుల సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కనుమూరి రఘురామకృష్ణంరాజు, బీదా మస్తాన్‌రావు, భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు పాల్గొన్నారు. తొలుత ఎంపీ బీదా మస్తాన్‌రావు మాట్లాడుతూ తాను కూడా ఆక్వా రైతునని, 1200 ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నానని తెలిపారు. ప్రతి ఆక్వా రైతులానే తాను కూడా ప్రస్తుతం నష్టాలను చవిచూశానన్నారు. ఆక్వా రైతుల కోసం తాను 33 శాతం ప్రోటీన్లతో కూడిన మేతను రూ.62కే రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం పంపిణీ చేసేలా సిఎం చంద్రబాబుతో మాట్లాడతానన్నారు. ఉండి నియోజకవర్గంలో ఆక్వా ల్యాబ్ ఏర్పాటుకు రూ.80 లక్షలు స్థానిక ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజుకు అందజేస్తానని హామీ ఇచ్చారు. యూనిట్ విద్యుత్ రూ.రెండుకే అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తాను కోరుతున్నానన్నారు. రైతులకు అవసరమైతే తనకున్న రెండు ఫీడ్ ప్లాంట్లలో ఒకటి ఇస్తానని, తనకు ఫీడ్ తయారీకి అయ్యే ఖర్చు మాత్రమే ఇస్తే సరిపోతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో ఫిషరీస్ రీసెర్చ్ సెంటర్ ఉందని, దానిని ఆక్వా రైతులందరూ వినియోగించుకోవాలని సూచించారు. మంగళవారం జరిగే సదస్సులో ఆక్వా ఎగుమతిదారులతో మాట్లాడి వారి అభిప్రాయాన్ని ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ ఇచ్చి ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఫీడ్ బస్తా తయారీకి సుమారు రూ.70 ఖర్చవుతుంటే దానిని రూ.2500కుపైబడి అమ్మడం ద్వారా రైతులను ఫీడ్ కంపెనీలు దోచుకుంటున్నాయని విమర్శించారు. ఫీడ్ ధరలను అదుపుచేయడంలో గత ప్రభుత్వం విఫలమైందని, ప్రస్తుత ప్రభుత్వం దానిపై దృష్టి సారించాలని అన్నారు. సాధారణంగా ఏప్రిల్, మే, జూన్‌లోనే సాగు ఎక్కువగా ఉంటుందని, ఆ సమయంలోనే మద్దతు ధర తగ్గిపోతుందని, సంవత్సరం పొడవునా ధరల స్థిరీకరణకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ప్రతి మండలంలోని ఆక్వా ల్యాబ్ ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ ఆక్వా రైతులకు ఉపయోగపడేలా గతంలో కృషి విజ్ఞాన కేంద్రంలో రూ.4 కోట్లతో ఏర్పాటు చేసిన ఆక్వా రీసెర్చ్ సెంటర్ నిరుపయోగంగా ఉందని, జిల్లా కలెక్టర్ సహకారంతో దానిని పూర్తిస్థాయిలో రైతులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. రైతులు సీడ్, ఫీడ్‌లను పరీక్షించి కొనుక్కునేందుకు బిఎంఆర్ అధినేత, రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్‌రావు రూ.80 లక్షలు సొంత నిధులు ఇస్తానని చెప్పడం, మేతను రైతులు సొంతంగా తయారు చేసుకునేందుకు అవసరమైతే తన ఫీడ్ ప్లాంట్ ఒకటి రైతులకు ఉచితంగా అందిస్తానని చెప్పడం ఆనందదాయకమన్నారు. రైతులందరూ నిబంధనలు పాటించి సాగు చేపడితే నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడదన్నారు. ప్రతి రైతూ నిబంధనలకు అనుగుణంగా మూడు మీటర్లు వదిలి తవ్వకాలు ప్రారంభించాలని, తద్వారా పంట కాలువలోకి మురుగునీరు వెళ్లకుండా మురుగు బోదెలు ఏర్పాటు చేసుకోగలుగుతారన్నారు. మురుగునీరు పంట కాలవలోకి వెళ్లడం వల్ల నీరు కలుషితమై ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. ఆక్వా ఎగుమతిదారులు, ఫీడ్ కంపెనీలు ఐకమత్యంగా ఉండటం వల్ల వారు లాభాల బాట పట్టారని, రైతులు ఎవరికి వారు యమునా తీరే అన్నట్లు ఉండటం వల్లనే నష్టాలను చవిచూడాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు, సుబ్బరాజు, రుద్రరాజు యువరాజు ఆక్వా రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేచురల్స్ బ్యూటీ సెలూన్ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంఎల్ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరులోని సత్రంపాడు సెంటర్లో నేరెళ్ల హోండా షోరూమ్ సమీపంలో ఆదివారం 'నేచురల్స్' బ్యూటీ సెలూన్‌ను ఏలూరు, దెందులూరు ఎంఎల్ఎలు బడేటి రాధాకష్ణయ్య (చంటి), చింతమనేని ప్రభాకర్, ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా దేశంలోనే ప్రఖ్యాతిగాంచిన 'నేచురల్స్' హెయిర్ అండ్ బ్యూటీ సెలూన్ సంస్థ ఏలూరు ఫ్రాంచైజ్ పార్టనర్లు బొప్పన శివన్నారాయణ, కాస్మటాలజిస్ట్ బొప్పన పద్మజాచౌదరి మాట్లాడుతూ తమ ఆధ్వర్యంలో ఏలూరులో ఇది రెండో బ్రాంచి అని చెప్పారు. ఏడేళ్ల క్రితం ఆర్ఆర్‌పేటలో మొదటి బ్రాంచ్‌ను ప్రారంభించామన్నారు. వినియోగదారులు ఇచ్చిన ప్రోత్సాహంతో సత్రంపాడులో రెండో బ్రాంచిని ప్రారంభిస్తున్నట్లు ఆమె చెప్పారు. తమ సంస్థ బ్రైడల్ మేకప్‌కు ప్రత్యేకత కలిగి ఉందన్నారు. పురుషులకు వేరుగాను, స్త్రీలకు వేరుగాను సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. అందరికీ అందుబాటులో ఉండే ఫీజులే తాము తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు మార్కెట్‌యార్డు ఛైర్మన్ ఎం.పార్థసారథి, 21వ డివిజన్ కార్పొరేటర్ అన్నపనేని భారతి, 20 డివిజన్ కార్పొరేటర్ గూడూరి ప్రసాద్, భారతి విద్యాసంస్థల అధినేత అన్నపనేని రవికుమార్, ఏలూరు, సత్రంపాడు పరిసర ప్రాంతాల్లోని వ్యాపార ప్రముఖులు, వినియోగదారులు పాల్గొన్నారు.

కృష్ణకు అంబేద్కర్ జాతీయ ప్రతిభా పురస్కారం

పలువురి అభినందన

పురస్కారం అందుకుంటున్న గుగ్గులోతు కృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ఇందిరా కాలనీ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న గుగ్గులోతు కృష్ణకు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జాతీయ ప్రతిభా పురస్కారం లభించింది. ఉపాధ్యాయునిగా విద్యా రంగంలోనూ సామాజిక సేవా రంగంలో సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్నందుకు ఆయన చేసిన సేవలను గుర్తించిన దక్షిణాది రాష్ట్రాల ప్రయివేట్ అధ్యాపకులు, ఉపాధ్యాయుల ఆర్గనైజేషన్ 2025వ సంవత్సరానికి ఈ అవార్డును అందించారు. ఆదివారం సాయంత్రం గుంటూరులోని ఆంధ్ర క్రిస్టియన్ కళాశాల అసెంబ్లీ హాలులో ఉపాధ్యాయ మాజీ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ చేతుల మీదుగా గుగ్గులోతు కృష్ణమాస్టారు అందుకున్నారు. 1997లో విధుల్లో చేరిన కృష్ణ 28 ఏళ్ల పాటు సామాజిక సేవే లక్ష్యంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పాఠశాల అభివృద్ధికి, విద్యారంగం అభివృద్ధికి, విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేసిన ఆయన 2007లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును, 2024లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి, ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 1938 జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.రత్నంబాబు, జి.మోహన్‌రావు, ప్రధానోపాధ్యాయులు టి.శ్రీనివాసరావు, బంజారా లంబాడి సుగాలి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూక్యా నాగేశ్వరావు నాయక్, దారావతు కిమ్యానాయక్, జిల్లా అధ్యక్షులు ధారావతు రాజాబాబు నాయక్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు, సన్నిహితులు, మిత్రులు కృష్ణమాస్టారుకు అభినందనలు తెలిపారు.

ఏలూరులో అకాల వర్షం

పలు రోడ్లు జలమయం, నిలిచిన విద్యుత్ సరఫరా

వాహనదారులు, ప్రయాణికుల ఇబ్బందులు

పలు అవస్థలకు గురైన చిరు వ్యాపారులు

నగరంలో పడుతున్న వర్షం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు నగరంలో ఆదివారం రాత్రి గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో నగరంలోని పలు రోడ్లు జలమయం అయ్యాయి. ఈదురు గాలులు ఎక్కువ కావడంతో ఒక్కసారిగా నగరానికి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో నగరం అంధకారంలో మునిగిపోయింది. హఠాత్తుగా వచ్చిన వర్షంతో ఓవైపు నగరంలో రోడ్లు జలమయం, అంధకారంలో మునిగినప్పటికీ పగలంతా వేడి తాపంతో ఉన్న ప్రజలు ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో సేదతీరారు. రోడ్లు జలమయం కావడంతో ప్రయాణికులు, వాహనదారులు పలు ఇబ్బందులకు గురయ్యారు.

దెబ్బతిన్న చిరు వ్యాపారులు

ఏలూరు అర్బన్ : ఏలూరు నగరంలో ఆదివారం రాత్రి అకస్మాత్తుగా కురిసిన వర్షం చిరు వ్యాపారులను ఉక్కిరిబిక్కిరి చేసింది. రాత్రి 7:30 గంటల సమయంలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. గత రెండు రోజులుగా నగరంలో విపరీతమైన ఎండలు, ఉక్కపోతతో ఉన్న నగర ప్రజలు ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో సేద తీరారు. గత కొన్నేళ్లుగా సండే మార్కెట్ నగరంలో విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా టూ టౌన్ ప్రాంతంలోని ఆర్ఆర్.పేట మెయిన్ రోడ్డులో వందలాది దుకాణాలు, రోడ్డు పక్కన పెట్టే చిరు వ్యాపారాలు విపరీతంగా పెరిగి సండే మార్కెట్‌కు జనం విపరీతంగా అలవాటు పడ్డారు. ఆదివారం సాయంత్రం ఐదు గంటల నుంచి ఆ రోడ్డులో వేలాదిమంది ప్రజలు వారికి కావాల్సిన రకరకాల బట్టలు, ప్లాస్టిక్, స్టీల్, ఫ్యాన్సీ సామగ్రి కొనడమే కాకుండా పిల్లలతో ఆర్ఆర్ పేట పార్కుకు వెళ్లి కొద్దిసేపు గడుపుతారు. దీంతో ఆదివారం వస్తే బట్టల దుకాణాల యజమానులు రకరకాల డిస్కౌంట్లు ఇస్తూ మైకులు పెట్టి మరీ అరుస్తూ పెద్ద ఎత్తున వ్యాపారం చేస్తూ ఉంటారు. అంతేకాకుండా ఆ రోడ్డులో రకరకాల తినుబండారాల వ్యాపారం సైతం పెద్ద ఎత్తున సాగుతుంది. అయితే ఆదివారం అకస్మాత్తుగా వర్షం కురవడంతో చిరు వ్యాపారాలన్నీ మూతపడ్డాయి. తమ సరుకు తడిచిపోకుండా ఎక్కడికక్కడ వ్యాపారులు దుకాణాలపై ప్లాస్టిక్ పట్టాలు కప్పుకుని జాగ్రత్తలు తీసుకున్నారు. అయినప్పటికీ కొన్ని దుకాణాల్లో సరుకులు తడిసిపోవడంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అంతేకాకుండా వేసవి సీజన్ కావడంతో విపరీ తమైన రద్దీగా ఉండే ఫ్రూట్ జ్యూస్ షాపులు సైతం వర్షం వల్ల వెలవెలబోయాయి. మొత్తం మీద ఏలూరు నగరంలో ఆకస్మాత్తుగా కురిసిన వర్షం చిరు వ్యాపారుల పాలిట శాపంగా మారింది. వారం మొత్తం ఎదురు చూసి పెద్ద మొత్తంలో సరుకు తెచ్చుకుని వ్యాపారం కోసం ఎదురుచూసిన వారికి నిరాశే మిగిలింది.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరుతున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - ముసునూరు

ప్రభుత్వ పాఠశాలలో చదివిన ప్రతి విద్యార్థి ఉన్నత స్థానంలో నిలిచారని, ప్రతిఒక్కరినీ తమ పాఠశాలలో చేర్పించాలని ప్రధానోపాధ్యాయులు పివిఎస్.రామకృష్ణ అన్నారు. మండలంలోని రమణక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గ్రామంలో ఇంటింటికి వెళ్లి పిల్లలను తమ పాఠశాలలో చదివించాలని, తమ పాఠశాలలో నాణ్యమైన చదువుతోపాటు యూనిఫామ్, బుక్స్, నోట్ బుక్స్, షూస్, తల్లికి వందనం రూ.15 వేలు ఆర్థిక సహాయంతో పాటు అన్ని వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. అన్ని అర్హతలు ఉన్న ఉపాధ్యాయులతో బోధన చేయిస్తున్నామన్నారు. ప్రతిఒక్కరూ ఆలోచించి ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, సుజాత, దుర్గాభవాని, షకీలా, తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్ రద్దు : డిఆర్ఒ

ప్రజాశక్తి - ఏలూరు

ఈ నెల 14వ తేదీ సోమవారం ఏలూరులోని జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)ను రద్దు చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు తెలిపారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు సెలవు అని, అందువల్ల ఈ నెల 14న సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను రద్దు చేశామని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు

మాట్లాడుతున్న ప్రముఖులు

జ్యోతిరావు పూలే, అంబేద్కర్ జయంతుల సమ్మేళనం

ప్రజాశక్తి - ఏలూరు

స్థానిక సర్ సిఆర్ రెడ్డి బిఇడి కాలేజీలో జ్యోతిరావు పూలే 198వ జయంతి, బిఆర్.అంబేద్కర్ 134వ జయంతి సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం, మానవత, యుటిఎఫ్, బోఫ్ సంయుక్త ఆధ్వర్యంలో సమ్మేళనం పోటీలు, సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సభకు యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా సెట్ వెల్ సిఇఒ కెఎస.ప్రభాకర్, స్టెప్ నిర్వాహకులు, సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు హాజరయ్యారు. సీనియర్ వైద్యులు రావి గోపాలకృష్ణయ్య, రిటైర్డ్ ఆచార్యులు డి.అబ్రహం, ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వి.వెంకటేశ్వరరావు, డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు, గుడిపాటి నరసింహారావు, ఆలపాటి నాగేశ్వరరావు, మేతర అజయ్‌బాబు, జి.రాంబాబు, వై.నిర్మల, జి.నీలిమ, పి.రవీంద్ర, డివివి.నరసింహారావు, ఎస్‌కె.ముస్తఫాఅలీ తదితరులు హాజరయ్యారు. హై స్కూల్ విద్యార్థులు, కాలేజీ విద్యార్థులు, పెద్దలు 25 మంది జ్యోతిరావు పూలే, అంబేద్కర్ జీవితాలు, ఆదర్శం గురించి జరిపిన పోటీల్లో పాల్గొని మాట్లాడారు. సభలో కొవ్వలి శ్రీనివాస్ ప్రదర్శించిన మ్యాజిక్ షో, టాకీ డాల్ కార్యక్రమం, పి.మంగరాజు, జి.నీలిమ, కె.శ్రావణికుమారి, బి.మోహనరావు, దేవరకొండ లలిత పాడిన పాటలు అందరినీ అలరించాయి. ప్రత్యూష సుబ్బారావు మాట్లాడుతూ పూలే అంబేద్కర్ జీవితాల్లో ఉన్న చదువు ప్రాధాన్యత, ఐక్య పరచడం, క్రమశిక్షణ, పట్టుదల, జ్ఞానం అవసరం నేటి తరం పట్టుకోవాలన్నారు. మనువాద ప్రమాదం గురించి చర్చ జరగాలన్నారు. కెఎస్.ప్రభాకరరావు మాట్లాడుతూ అభివృద్ధి చెందడమంటే ఒక్కరి అభివృద్ధి కాదని, అందరి అభివృద్ధి అని గుర్తించాలన్నారు. చదువు ద్వారా అది సాధించాలన్నారు. డాక్టర్ రావి గోపాలకృష్ణయ్య మాట్లాడుతూ తన ఇంట్లో సేవ చేసేవారి నుంచి అందరినీ సహాయకులుగా చూసి వారిని చదువులో, జీవితంలో మంచివారిగా ఎదగడానికి అందరూ తోడ్పాడాలన్నారు. ఉపన్యాస పోటీల్లో పాల్గొన్న వారికి ప్రశంసాపత్రాలు, రాజ్యాంగం బుక్స్, విజేతలకు మెడల్స్ అతిథుల చేతుల మీదుగా అందించారు.


శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

ముదినేపల్లిలో రక్తదానం

ప్రజాశక్తి - ముదినేపల్లి

భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ 134వ జయంతిని పురస్కరించుకుని జై భీమ్ యువసేన ఆధ్వర్యంలో ముదినేపల్లి పంచాయతీ రెండో వార్డు నెంబర్ మదిరి పార్థసారథి ఆదివారం ముదినేపల్లిలోని అంబేద్కర్ కాలనీలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ టూరిజం శాఖ డైరెక్టర్ కొడాలి వినోద్‌తో పాటు 23 మంది యువకులు పాల్గొని రక్త దానం చేశారు. తొలుత కొడాలి వినోద్ కేట్ కట్ చేశారు. గుడివాడ ఏరియా ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది ఈ రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కైకమ్మ, నిమ్మగడ్డ బిక్షాలు, బుంగా జోజి, పాగోలు విజయ్ సాగర్, గద్దే రాజు, గోనా దావీదు పాల్గొన్నారు.

పిటిఎల్‌పియు గౌరవ సలహాదారునిగా శేఖర్

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయివేట్ టీచర్స్, లెక్చరర్స్, ప్రొఫెసర్స్ యూనియన్ (పిటిఎల్‌పియు) గౌరవ సలహాదారునిగా మండల పరిధిలోని బొద్దనపల్లి గ్రామానికి చెందిన మంజీర గళం (ఎంజి టివి) తెలుగు దినపత్రిక అధినేత డాక్టర్ పెనుముచ్చు శేఖర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను అభినందించారు.

బిస్కెట్, వాటర్ ప్యాకెట్లు అందిస్తున్న మానవత సభ్యులు

బిస్కెట్లు, వాటర్ ప్యాకెట్లు అందజేత

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడిలో కనిపెడ రోడ్డులో ఉన్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలలో ఆదివారం జరిగిన ఎంట్రన్స్ ఎగ్జామ్స్ రాయటానికి వచ్చిన బాలబాలికలకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చింతలపూడి శాఖ ఆధ్వర్యంలో బిస్కెట్ ప్యాకెట్లు, వాటర్ ప్యాకెట్లు అందించారు. ఏలూరు, చింతలపూడి ,దెందులూరు, పోలవరం నియోజకవర్గాల నుంచి ఎంట్రెన్స్ పరీక్ష కోసం 500 మంది వచ్చారు. వారికి బిస్కెట్ ప్యాకెట్లు, కిసాన్ వాటర్ ప్లాంట్ యజమాని సయ్యద్ బాషు అబ్బాస్ అందించిన వెయ్యి వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మానవత కమిటీ సభ్యులు కె.నాగ చిన్నారావు, ఎం.సామ్యూల్, కె.సురేంద్రబాబు, ఎన్.అశోక్‌బాబు, జె.విశ్వేశ్వరరావు, పి.కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఆర్థికసాయం అందిస్తున్న మనోజ్

మండలంలోని వడాలి కాలనీకి చెందిన ఆవుల వీరయ్య (25)అనే నిరుపేద వ్యక్తి గత కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి తన తండ్రి డాక్టర్ మనోజ్‌కు ఈ విషయం తెలిపారు. దీంతో మృతుని కుటుంబ సభ్యులను డాక్టర్ మనోజ్ పరామర్శించి రూ.ఐదు వేలు ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులు అందించారు. అలాగే వడాలి గ్రామ సర్పంచి మరీదు దుర్గాశ్రీ కూడా మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందించారు. అదేవిధంగా ముదినేపల్లి అంబేద్కర్ కాలనీకి చెందిన పరిసిపోగు శివాజీ గుండెపోటుతో మృతి చెందగా మృతుని భార్య అన్నపూర్ణను డాక్టర్ మనోజ్ పరామర్శించి మట్టి ఖర్చులు నిమిత్తం ఆమెకు రూ.ఐదు వేలు ఆర్థిక సాయం అందించారు.

నేరాలు - ఘోరాలు

మురుగు కాలువలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

మురుగుకాలువలో పడి వ్యక్తి మతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల ప్రకారం... మండలంలోని వాడవల్లి దళితవాడకు చెందిన జి.జోజి (35) ఈ నెల 11వ తేదీన శుక్రవారం ఉదయం పశువులను మేపేందుకు సమీపంలోని పొలాల్లోకి తోలుకెళ్లాడు. ఈ క్రమంలో జోజికి అకస్మాత్తుగా మూర్ఛ రావడంతో పక్కనే ఉన్న మురుగు కాలువలో పడి ఊపిరాడక మతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. జోజి మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పడకేసిన పారిశుద్ధ్యం

పేరుకుపోతున్న చెత్త కుప్పలు
విజృంభిస్తున్న దోమలు
ప్రజల అవస్థలు
పట్టించుకోని అధికారులు

పేరుకుపోయిన చెత్త

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు కార్పొరేషన్ పరిధిలో ఉన్న కొన్ని డివిజన్లలో పారిశుధ్య పరిస్థితులు దారుణంగా మారాయి. మరీ ముఖ్యంగా కొత్త బస్టాండ్ పక్కన ఎంఆర్‌ఎఫ్ టైర్స్ షోరూమ్ వద్ద చెత్తను ఒక దగ్గర వేయడంతో పది రోజుల నుంచి కుప్పల పేరుకుపోయి అలాగే ఉండడంతో ఆ చుట్టుపక్కల పందుల సంచారం పెరిగిపోయిందని, దోమలు అధికంగా పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే ప్రాంతంలో డ్రెయినేజీలు పూడిక తీయకపోవడంతో నీరు డ్రెయినేజీలోనే నిలిచిపోయింది. అంతేకాకుండా కొత్త బస్టాండ్ వెనుక రైల్వే ట్రాక్ రోడ్డు వైపు డ్రెయినేజీ పూడిక తీసి అలాగే వదిలేయడంతో మళ్లీ తీసిన పూడిక మొత్తం డ్రెయినేజీలోకి జారిపోతుందని స్థానిక ప్రజలు తెలుపుతున్నారు. దోమలు పెరిగిపోవడంతో పాటు తీవ్ర దుర్వాసన వస్తుందని, శానిటేషన్ సిబ్బంది కన్నెత్తయినా ఇటువైపు చూడట్లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్తని తీసుకెళ్లడానికి కూడా వారానికి మూడు రోజులు మాత్రమే వస్తున్నారని, అధికారులు ఇటువంటి ప్రాంతాలను గుర్తించి పారిశుధ్య పరిస్థితులపై దృష్టి సారించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

పందుల సంచారం

శ్రీ సుగుణ కళాశాల విద్యార్థుల విజయ పరంపర

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక శ్రీ సుగుణ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో తమ విజయపరంపర కొనసాగించినట్లు కళాశాల ఛైర్మన్ కారి రాజమణి తెలిపారు. ద్వితీయ సంవత్సరం సిఇసిలో వడిగిన నిఖిత 1000 మార్కులు 875, బిరుదుగడ్డ ధర్మతేజ 882 మార్కులు, బైపిసిలో పంచకర్ల బాల సంధ్య 1000 మార్కులకు 854 సాధించారన్నారు. ప్రథమ సంవత్సరం ఎంపిసిలో ఎండి అమేషున్నిసా 470 మార్కులకు 431, సిఇసిలో గడ్డాడ సిరి 500 మార్కులకు 448, బైపిసిలో గొడవర్తి ప్రవళిక 440 మార్కులకు 406 సాధించి ముందంజలో నిలిచారన్నారు. ప్రథమ సంవత్సరం సబ్జెక్టు వారీగా ఫిజిక్స్‌లో ఆమేషున్నిసా 60 మార్కులకు 60, బొటనిలో వర్షిత, ప్రవల్లిక 60 మార్కులకు 60 సాధించగా, ద్వితీయ సంవత్సరం బొటనిలో పి.బాలసంధ్య 60 మార్కులకు 60, జువాలజీలో 60 మార్కులకు 60 సాధించి తమ సత్తా చాటారన్నారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, ఫలితాల సాధనకు కృషి చేసిన అధ్యాపకులకు కళాశాల ఛైర్మన్ కారి రాజమణి, ప్రిన్సిపల్ తట్టుగోళ్ల వెంకటేశ్వరరావు, ఎఒ పోతురాజు, అజయ్‌బాబు అభినందనలు తెలిపారు.

ఘనంగా జింగిల్‌బెల్స్ స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఎన్నో ఆటుపోట్లను తట్టుకుని, ఎన్ని కష్టాలు వచ్చినా వెనక్కి తగ్గకుండా ముందుకు సాగుతున్న స్కూల్ న్యూ జింగిల్ బెల్స్ స్కూల్ అని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి అన్నారు. ఏలూరులోని శ్రీరామ్‌నగర్‌లో జింగిల్ బెల్స్ స్కూల్ 14వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎల్‌ఎ బడేటి చంటి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా విద్యార్థులు అనేక సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. పిల్లలకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందించారు. అనంతరం ఎంఎల్‌ఎ బడేటి చంటి మాట్లాడుతూ ఎన్నో ఆటుపాట్లను తట్టుకుని విజయవంతంగా 14వ వార్షికోత్సవం పూర్తి చేసుకున్న న్యూ జింగిల్ బెల్స్ స్కూల్‌కు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులందరూ క్రమశిక్షణతో బాగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థానానికి రావాలని ఆకాంక్షించారు. ఒకపక్క స్కూల్ ప్రిన్సిపల్‌గా మరోపక్క రాజకీయంగా కడియాల విజయలక్ష్మి రాణిస్తున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో జింగిల్ బెల్స్ స్కూల్ ఛైర్మన్ ప్రసాద్, ప్రిన్సిపల్ కడియాల విజయలక్ష్మి, చిల్డ్రన్ వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్ వెంకటేశ్వరరావు, ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి, స్కూల్ స్టాఫ్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ బడేటి చంటి

జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

గవర్నమెంట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ ఎన్నిక ఆదివారం ఏలూరు కోటదిబ్బలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగింది. 2025 నుంచి 2028 వరకు మూడేళ్ల కాల పరిమితికి జిల్లా కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షులుగా జి.భక్తహనుమాన్, ఉపాధ్యక్షులుగా ఖాసీం పీరా, కార్యదర్శిగా వి.శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా జనార్ధనరావు, కోశాధికారిగా కె.సమత, మహిళా కార్యదర్శిగా బి.ప్రమీల, రాష్ట్ర కౌన్సిలర్‌గా డాక్టర్ బివి.శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన కార్యవర్గాన్ని పలువురు అధ్యాపకులు అభినందించారు.ఎన్నికల అధికారిగా జీ. సందీప్, అబ్జర్వర్ గా ఏ. మురళీకష్ణ వ్యవహరించారు.

జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం

నూజివీడులో చలివేంద్రం ప్రారంభం

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎంఎల్‌ఎ వెంకటప్రతాప్‌అప్పారావు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఉదయగిరి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూజివీడు పట్టణంలోని శ్రీనివాస మహల్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద చలివేంద్రం ఆదివారం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా నూజివీడు మాజీ ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాల నుంచి ఉదయగిరి ఛారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, ప్రెసిడెంట్ ఉదయగిరి కృపారావు ప్రతి వేసవికాలంలో బాటసారులకు మినరల్ కూలింగ్ వాటర్ అందించడమే కాకుండా ప్రతి వారం పేదలకు అన్నదాన కార్యక్రమం చేస్తూ ఎంతోమంది పేదప్రజలు ఆకలిని తీర్చడం అభినందనీయమన్నారు. రెవెన్యూ డివిజన్ కేంద్రమైన నూజివీడు పట్టణానికి వచ్చే ప్రజలు వేసవికాలం కాలంలో ఈ సేవను వినియోగించుకోవాలని సూచించారు. ఎండలు ఎంతో తీవ్రంగా ఉన్నాయన్నారు. మాజీ సిఎం కీర్తిశేషులు డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, వారి తనయులు మాజీ సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డిల స్ఫూర్తితో కృపారావు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం ప్రశంసనీయమన్నారు. కృపారావు అందిస్తున్న సేవలు నేటి యువతరానికి ఆదర్శనీయమని వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు శీలం రాము, మున్సిపల్ వైస్ ఛైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు కల్లేపల్లి ఆదినారాయణ, కలపాల కృపారావు పాల్గొన్నారు.

అలజడులు లేకుండా చూసుకోవాలి

నేడు అంబేద్కర్ జయంతి సందర్భంగా పోలీసుల సూచనలు

ప్రజాశక్తి - పోలవరం

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఎటువంటి అలజడులు లేకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని పోలవరం సిఐ బాలసురేష్‌బాబు సూచించారు. మండలంలోని అంబేద్కర్ విగ్రహాలను ఎస్ఐ ఎస్ఎస్ఎస్.పవన్ కుమార్‌తో ఆయన ఆదివారం కలిసి పరిశీలించారు. జయంతి ఉత్సవాల నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కొత్త పైడిపాక అంబేద్కర్ విగ్రహ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతులు జరుపుకోవడం హర్షించదగిన విషయమన్నారు. వేడుకలను నిర్వహించే నిర్వాహకులపై ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. ర్యాలీ చేసేటప్పుడు ఉద్రిక్తలు తలెత్తకుండా సామరస్యంగా జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ర్యాలీ సమయంలో యువకులు గొడవలు పడకూడదని హితవు పలికారు. ఏమైనా ఇబ్బందికరమైన పరిస్థితులు తలెత్తితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించి, ఆయన స్ఫూర్తితో ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలిస్ సిబ్బంది కె.శ్రీనివాస్, కోటి, నవ చైతన్య అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు ఈర్నాల జాన్, కవల గంగాధర్, రాపాక వెంకటేశ్వరరావు, బచ్చుల ముత్యాలు, రాపాక గోపీ, తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి :విద్యతోనే డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భారతదేశానికి రాజ్యాంగాన్ని రాయగలిగారని కైకలూరు రూరల్ సిఐ రవికుమార్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన ఆదివారం మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 134వ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. విద్యతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు జయంతిని పురస్కరించుకుని వివాదాలకు తావులేని మంచి కార్యక్రమాలను నిర్వహించుకోవాలన్నారు. మైకులు, డీజేలను ఏర్పాటు చేసి డబ్బులు వృథా చేసుకోవద్దని, ఆ డబ్బులతో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ పేరుపై పేద విద్యార్థులకు ఫీజులు చెల్లించడం, వృద్ధులకు భోజనం ఏర్పాటు చేయడం, పాదచరులకు ఉపయోగపడేలా వేసవిలో చలివేంద్రాలు వంటి కార్యక్రమాలను నిర్వహించుకోవాలన్నారు. కమిటీ సభ్యులు ర్యాలీల్లో ఎటువంటి అవకతవకలకు, వివాదాలకు లేకుండా జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించుకోవాలని తెలిపారు. కమిటీ సభ్యులు విధిగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామచంద్రరావు, ఎఎస్ఐ కాకుండలు రాజు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పోలవరంలో...

మండవల్లిలో....

పలుచోట్ల ఘనంగా మట్టల ఆదివారం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఏసుక్రీస్తు సిలువ మరణం పొందక ముందు చివరిసారిగా యెరుషలేమును దర్శించిన దినాన్ని పురస్కరించుకుని నిర్వహించే మట్టల ఆదివారం ముదినేపల్లి మండలంలోని ఎల్ఇఎఫ్ చిన్నారులు, ఆర్‌సిఎం చర్చి సంఘ విశ్వాసులు పురవీధుల్లో ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ది లేమెన్స్ ఇవాంజిలికల్ ఫెలోషిప్ చిన్నారులు పురవీధుల్లో పూలతో అలంకరించిన ఈత మట్టలు చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. ఈ మట్టల ఆదివారం ఆరాధనలో ఆర్‌సిఎం చర్చి ఫాదర్ కమతం మరియదాసు, ఎల్ఇఎఫ్ చర్చిలో ఇశ్రాయేలు ప్రత్యేక సందేశాలు ఇచ్చారు. ఆర్‌సిఎం చర్చి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో వందలాదిమంది విశ్వాసులు పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మట్టల ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ముదినేపల్లిలో...

పోలవరం : మండలంలో మట్టల ఆదివారం వేడుకలు పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. కొత్తపట్టిసీమలో సెయింట్ పాల్స్ లూథరన్ చర్చి ఆవరణలో సండే స్కూల్ టీచర్ ఆధ్వర్యంలో సండే స్కూల్ పిల్లలు గ్రామ వీధుల్లో మట్టలతో తిరుగుతూ ర్యాలీ నిర్వహించారు. సెయింట్ పాల్స్ లూథరన్ చర్చి సంఘ కాపరి నోవాహు మాట్లాడారు. అనంతరం సెయింట్ పాల్స్ లూథరన్ చర్చి సంఘ కాపరి నోవాహు, సిఆర్‌డి ఇమ్మానియేలు, ఆల్టర్నేట్ డెలిగేట్ జి.అబ్రహం, సంఘ పెద్దలు, యూత్, సండే స్కూల్ విద్యార్థులు స్త్రీల సమాజం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఏలూరు అర్బన్ : నగరంలో ఆదివారం క్రైస్తవులు మట్టల ఆదివారం పండుగను ఘనంగా జరుపుకున్నారు. అన్ని సంఘాల్లో పిల్లలు, పెద్దలు రంగు రంగుల పూలతో అలంకరించిన ఈత మట్టలను చేత పట్టుకుని నగర వీధుల్లో తిరుగుతూ, క్రైస్తవ గీతాలను ఆలపించారు. నగరంలోని సిఎస్ఐ, లూథరన్, ఎల్ఇఎఫ్, బాప్టిస్ట్, రోమన్ కేథలిక్ సంఘాలతో పాటు ఇతర సంఘాల ఆధ్వర్యంలో పిల్లలనుంచి పెద్దల వరకు తెల్లని దుస్తులు ధరించి రంగురంగుల పూలతో అలంకరించిన ఈతమటలను పట్టుకుని తమ చర్చి పరిసరాల్లో క్రైస్తవ గీతాలను ఆలపిస్తూ ప్రదర్శన నిర్వహించి ఘనంగా మట్టల ఆదివారం జరుపుకున్నారు.

పోలవరంలో...

నేడు అంబేద్కర్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - మండవల్లి

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి మహోత్సవాన్ని అంబేద్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహిస్తున్నామని అసోసియేషన్ అధ్యక్షులు గౌరవ అధ్యక్షులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ఎల్ఎస్.భాస్కరావు చాబత్తిన విజయ్ మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 134వ జయంతి కార్యక్రమాన్ని మండవల్లి ప్రధాన సెంటర్‌లో ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐఆర్ఎస్ చాగంటి సంజీవయ్య మాల మహాసేన జాతి అధ్యక్షుడు అలగ రవికుమార్ పాల్గొంటారని తెలిపారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌కు పూలమాలలు వేసిన అనంతరం పది గంటలకు సభ ప్రారంభమవుతుందని అనంతరం భోజన వసతి ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రతిఒక్కరు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షులు కొరపాటి శాంతరాజు, కార్యదర్శి కొండపల్లి రవి వరప్రసాద్, ట్రెజరర్ దాకారపు వినోద్, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ యూత్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో తిరుమల విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం శనివారం విడుదల చేసిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్ష ఫలితాలలో భీమవరం తిరుమల జూనియర్ కాలేజ్ విద్యార్థులు అత్యద్భుతమైన ఫలితాలు సాధించారని విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలియజేశారు. కళాశాలలో ఆదివారం విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఫలితాల వివరాలను వెల్లడించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్ష ఫలితాలలో ఎంపిసి విభాగంలో 470 మార్కులకు వివి.మణికంఠ సత్యసాయి 466 మార్కులతో భీమవరం పట్టణంలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోవటంతో పాటు ఒకరికి లేదా ఇద్దరికి కాకుండా 24 మందికి 465 మార్కులు రావటం అత్యద్భుతమైన ఫలితాలు సాధించటానికి నిదర్శనమని తెలియజేశారు. 460కుపైగా సాధించిన వారు 155 మంది, 450కుపైగా సాధించిన వారు 345 మంది, 440పైగా సాధించిన వారు 452 మంది, 420పైగా సాధించిన వారు 622 మంది, 400 పైగా సాధించిన వారు 739 మంది అలాగే బైపిసి విభాగంలో 440 మార్కులకు కె.శ్రావ్య, జి.హాసిని రిత్విక, జి.మనస్విని 434 మార్కులతో ప్రథమ స్థానం కైవసం చేసుకోగా, పి.జ్యోషిక శ్రీవల్లి 433, కె.మధునయన, కె.ప్రజ్ఞ ప్రిస్కిల్ల 432 మార్కులు, సిహెచ్.లెహర్ష, సిహెచ్.రేవతి, జె.విద్య 431 మార్కులు సాధించగా, 430పైగా మార్కులు సాధించినవారు 12 మంది, 420పైగా సాధించిన వారు 27 మంది, 400పైగా 51 మంది సాధించారని తెలియజేశారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాలలో ఎంపిసి విభాగంలో 1000 మార్కులకు ఎండి అష్రఫ్ 990 మార్కులతో మొదటి స్థానం కైవసం చేసుకోగా, కె.విమల్, కె.మణికంఠ రెడ్డి, కె.సాయి హర్షిక్, కెఎన్.హాసిని, కెబిఎస్ఎల్.ప్రత్యూష 989 మార్కులతో ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. 980పైగా మార్కులు సాధించినవారు 99 మంది, 970పైగా సాధించినవారు 228 మంది, 960పైగా సాధించిన వారు 340 మంది, 900పైగా సాధించిన వారు 703 మంది, బైపిసి విభాగంలో 1000 మార్కులకు యు.శరణ్య 988 మార్కులతో ప్రథమ స్థానం కైవసం చేసుకోగా, సిహెచ్‌బిఎల్.ప్రసన్న, కె.శేషశ్రీ 987 మార్కులు, పి.భవ్యశ్రీ, ఒపి.దుర్గా ప్రసాద్ 986 మార్కులు సాధించగా, 970పైగా మార్కులు సాధించినవారు 22 మంది, 950పైగా సాధించిన వారు 39 మంది, 900పైగా సాధించిన వారు 61 మంది అని తెలియజేశారు. విద్యాసంస్థల డైరెక్టర్స్ ఎస్.సాయిరాజు, పి.శ్రీనివాసవర్మ, జి.సతీష్ బాబు మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం ఉత్తీర్ణత 96.8 శాతం, ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణత 99.1 శాతం సాధించారని, ప్రథమ, ద్వితీయ సంవత్సరం బైపిసి విభాగంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలియజేస్తూ, ఈ ఫలితాలను సాధించిన విద్యార్థులకు, సిబ్బందికి అభినందనలు, తల్లిదండ్రులకు, శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు తెలియజేశారు.

'పెనుగొండ'లో వడగళ్ల వాన

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలో ఆదివారం మధ్యాహ్నం ఒకసారిగా ఆకాశం మేఘావృతమై వడగళ్ల వాన కురిసింది. దేవ, ఇలపర్రు, సిద్ధాంతం గ్రామాల పరిధిలో ఈ వర్షం కురిసింది. దీంతో వరి రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పంట చేతికొచ్చే తరుణంలో వర్షం పంటను దెబ్బతీస్తుందని వారు వాపోతున్నారు.

సాగరతీరంలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్‌లో ఆదివారం పర్యాటకులతో సందడి నెలకొంది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక ద్విచక్ర వాహనాలలో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాలలో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకు వస్తున్న కెరటాలతో, ఇసుక తిన్నెలపై ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివి, కొబ్బరి తోటలలో సహబంతి భోజనాలు చేసి సేద తీరారు.